

# మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్

– దూరి వెంకటరావు

'సార్' చైతన్య పిలుపుకు గుర్రుగా చూశాడు విష్ణువర్ధన్.

"ఇది నా బదలీ దరఖాస్తు. దయచేసి త్వరగా హెడ్డాఫీసుకు పంపండి".

అంతవరకు కొరకొరలాడే విష్ణువర్ధన్ మొహం ఒక్కసారిగా ప్రసన్నమైంది.

"మొన్నటివరకు మ్యూచువల్ మాటెత్తితే మొహం ముడుచుకునే వాడివి, ఉన్నట్లుండి ఇలా మారిపోయావేం?" అడిగాడు నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"అప్పుడలా అనుకున్నాను. ఇప్పుడిలా నిర్ణయించుకున్నాను".

"గుడ్... రేపే మహేష్‌ని రప్పిస్తాను. దీని మీద అతడి సంతకం కూడా కాగానే పైకి ఫార్వర్డ్ చేస్తాను".

"థ్యాంక్స్".

చైతన్య వెళ్ళిపోయాడు. అతడిచ్చిన దరఖాస్తును ఒకటికి పదిసార్లు పరీక్షగా చూశాడు విష్ణువర్ధన్. లాటరీలో పది లక్షలు తగిలినంత సంబరంగా ఉందతడికి. తన మిత్రుడు మహేష్‌ని ఈ బ్రాంచికి రప్పించుకోడానికి మార్గం సుగమం కావడమే అందు క్కారణం. పైగా అతడు తన ఆధీనంలో పనిచేస్తాడు. వాడి ముందు తన దర్పాన్ని ప్రదర్శించుకోవడానికి అవకాశమేర్పడటంతో ఎంతో సంతోషంగా ఉందతడికి.

విష్ణువర్ధన్, మహేష్ కాలేజీలో స్నేహితులు. ఇద్దరి అభిరుచులు ఒకటే కావడంవల్ల ఇట్టే కలిసిపోయారు. మధ్యాహ్నం క్లాసు లెగ్గొట్టి మ్యాట్నీలకెళ్ళాలన్నా, పట్టుదలగా గంటల తరబడి చదవాలన్నా వాళ్ళకే చెల్లింది.

పట్టభద్రులవుతూనే పోటీ పరీక్షలకు పోటీపడ్డారు. గ్రూప్ వన్‌లో ఎంపికైన విష్ణువర్ధన్ ఆఫీసరైతే, మహేష్ గ్రూప్ త్రీలో సెలక్టయి గుమాస్తా అయ్యాడు. డిపార్టుమెంటు ఒకటే అయినా ఇరువురికీ వేర్వేరుచోట్ల పోస్టింగ్స్ వచ్చాయి. ఉద్యోగాల్లో చేరి ఎనిమిదేళ్ళవుతోంది. ట్రాన్స్‌ఫర్ల మీద ఊర్లు మారారు. ఆ తర్వాత ఎవరు ఎక్కడున్నది తెలియరాలేదు. మొన్న ఈ మధ్య ఇద్దరూ ఓ మ్యారేజి ఫంక్షన్‌లో కలుసుకున్నారు. కౌగిలించుకున్నారు. బాల్యచేష్టల్ని, జ్ఞాపకాల్ని మననం చేసు న్నారు.

ఇరువురూ సరిసమానంగా పెరిగినా తను ఇప్పుడో మెట్టుపైన ఉన్నందుకు ఒక్కింత గర్వంగా ఉంది విష్ణువర్ధన్‌కి. ఆప్తమిత్రుడు ఆఫీసరయినా తనను మరచిపోనందుకు మహా సంతోషంగా ఉంది మహేష్‌కి.

"ఎవరికీ అందకుండా అంతదూరంలో అఘోరించకపోతే మా బ్రాంచికి వచ్చేయరాదూ" అన్నాడు విష్ణువర్ధన్.

"మనం అనుకుంటే సరిపోతుందా, నా పోస్టు అక్కడ ఖాళీగా ఉండొద్దూ"

"అడ్డుంటే తొలగిస్తాం"

"అది నాకు నచ్చదు. నా మూలంగా మీ

ఆఫీసులో ఓ ఉద్యోగి తన అభీష్టానికి వ్యతిరేకంగా బదలీ కావడం నేను ఒప్పుకోను. పైగా అలా జరగడం అంత తేలికా కాదు"

"పోనీ ఒక పని చేస్తే"

ఏమిటన్నట్లు కళ్ళు పెద్దవి చేశాడు మహేష్.

"మీరిద్దరూ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోండి"

"అందుకు అతడు ఇష్టపడాలి కదా"

"అదంతా నాకు వదిలేయ్. ఇంతకీ నీకు రావాలని ఉందా? లేదా? ముందామాట చెప్పు"

"ఓకే. అతడిని అడిగి చూడు"

"అలాగే అతడు ఊఁ అంటే నీకు ఫోను చేస్తాను. సరేనా?"

విష్ణువర్ధన్ ఆఫీసులో అడుగుపెడుతూనే చైతన్యని పిలిచి అతడి అభిప్రాయాన్ని కనుక్కున్నాడు.

"మీ మాట కాదంటున్నందుకు మన్నించండి. నేను అంతదూరం వెళ్ళలేను. నా మాతృమూర్తి మంచందిగి గడపదాటే స్థితిలో లేదు. ఆవిడకు నేను తప్ప వేరే దిక్కులేదు. అన్నయ్య ఉన్నా ఉన్న మాటేగాని వాడికి సరైన ఉద్యోగం అంటూ ఏదీ లేదు. వాడి సంసారభారాన్ని నేను మోస్తున్నాను. ఇక్కడ నాకో స్వంతగూడు ఉండటంవల్ల అద్దెబాధ తప్పింది. ఆ డబ్బులు వాడికోసం వెచ్చించగలుగుతున్నాను. ఉన్నపళంగా నేనెక్కడికైనా వెళ్ళిపోతే వాళ్ళు అనాథలైపోతారు" అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

వళ్ళు మండింది విష్ణువర్ధన్‌కి. తన మాటకి సై అంటాడనుకున్నాడే తప్ప ఇలా తన బాధల్ని ఏకరవు పెడతాడనుకోలేదు.

అంతే, ఆ రోజులగాయితూ చైతన్యకి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఆఫీసుకు ఏమాత్రం ఆలస్యమైనా మెమో ఇస్తాడు. ఫైలు రాసి పట్టుకెళితే మొహాన విసిరికొడతాడు. స్వంత ఇట్లో ఉండటంవల్ల హెచ్.ఆర్.ఎ.కి ఎలిజిబిలిటీ లేదన్నాడు.

ఓసారి తన భార్య నొప్పులుపడుతోందని సెలవివ్వమని అడిగితే "నువ్వుగాని పురుడు పోస్తావా? అంటూ వెటకారమాడాడు. లీవ్ మాత్రం శాంక్షన్ చేయలేదు. ఎప్పుడు ఇంక్రిమెంటు ఊసెత్తినా గుర్రుమంటాడు. అడ్వాన్సు అడిగితే లేదు పొమ్మంటాడు. అందరి ముందు అవమానపరచి ఆనందిస్తాడు. పెదవి విప్పితే ఛార్జిషీటు అంటాడు.

చైతన్యని సమర్థిస్తే బాస్‌దృష్టిలో తామెక్కడ చెడ్డ అయిపోతామేమోనని స్టాఫ్ ఎవ్వరూ నోరుమెదపడంలేదు.

ఇది ఇండివిడ్యుయల్‌కేసు అంటూ యూనియన్లేవి పట్టించుకోవడంమానేసాయి. ఎంత రాత్రి అయినా చైతన్యని పనిపూర్తిచేసి మరీ వెళ్ళమంటాడు.

భార్యబిడ్డల్ని చూసుకోడానికి అవడంలేదు. తల్లిని డాక్టరుకి చూపిద్దామంటే తీరిక దొరకడంలేదు. తనొక యంత్రమై పోయాడు. అది ఆగాలన్నా, పనిచేయాలన్నా రిమోట్‌కంట్రోల్ బాస్ చేతిలో ఉంది. అదెప్పుడూ ఆన్‌లోనే ఉంటుంది. ఇహ అక్కడ పనిచేయలేక అడవిలోకైనా పోతే బాగుంటుందనిపించింది. అందుకే మ్యూచువల్ దరఖాస్తు రాసిచ్చాడు. తననీ బందిఖానా నుండి త్వరగా విముక్తి చేయమంటోందతడి మనసు.

తన పథకం పారినందుకు చాలా సంతోషంగా ఉంది విష్ణువర్ధన్‌కి. ఉన్నపళంగా బయలుదేరిరమ్మని మహేష్‌కి ఫోన్ చేశాడు.

మహేష్ విష్ణువర్ధన్ ఇంటికి వెళ్ళకుండా నేరుగా ఆఫీసు కొచ్చాడు.

ఇక మహేష్ ఎప్పటికీ తన దగ్గరే పనిచేస్తాడు. అనుక్షణం మిత్రుడి ముందు తన ఔన్నత్యాన్ని చాటుకోవచ్చు. ఆనందంలో విష్ణువర్ధన్ నోటినుండి మాటలు ఊడిపడటం లేదు.

"ఫోను చేసావని వచ్చాను. అర్జంటు పనేమైనా ఉందా?" అడిగాడు మహేష్.

"అవేమం మాటలురా నీ మ్యూచువల్ కోసం చైతన్యని ఒప్పించడానికి నేనెన్నితంటాలు పడ్డానో నీకేం తెలుసు. మొత్తానికి ఎలాగైతేనేం ఒప్పుకున్నాడు. సరే, అవన్నీ ఇప్పుడెందుకులే. ముందు దీనిమీద సైన్ చేయి." అన్నాడు విష్ణువర్ధన్ డ్రాయర్లోంచి కాగాతాన్ని బయటకు తీసి.

"సారి. నాకీ ట్రాన్స్‌ఫర్ వద్దు"

ఊహించని ఆ జవాబుకు అవాక్కయిపోయాడు విష్ణువర్ధన్. క్వశ్చన్ మార్క్ అయిందతడి ఫేసు.

"నన్నిక్కడకి రప్పించుకోవడం కోసం చైతన్యనిఎన్ని ఇబ్బందులకు గురిచేసావో తెలిసింది. నిన్నిప్పుడు నా స్నేహితుడనుకోడానికి కూడ మనస్కరించడంలేదు. నీదగ్గర ఊడిగం చేసేబదులు ఉద్యోగానికి రాజీనామా చేయడం ఉత్తమం. బై..." అంటూ సుడిగాలిలా బయటకు వెళ్ళిపోయాడు మహేశ్.

మిత్రుడి మాటలు విష్ణువర్ధన్ గుండెల్లో ఈటెల్లా గుచ్చుకున్నాయి.

ఆ సమయంలో చైతన్య అక్కడే ఉన్నాడు. స్టాఫంతా కిటికీలోంచి తొంగి చూస్తున్నారు. పిచ్చెక్కినట్లైంది విష్ణువర్ధన్‌కి. అవమాన భారంతో కుంచించుకుపోయాడు. గాలివానలా ఛిద్రమైపోయిందతడి అంతరంగం.

వెంటనే పెన్ను తీసి తనే ట్రాన్స్‌ఫర్‌కి దరఖాస్తు చేసుకున్నాడు.

●

## మెగా కాంబినేషన్



క్రియేటివ్ డైరెక్టర్‌గా పేరు పొందిన కృష్ణవంశీ దర్శకత్వంలో నటించడానికి అగ్ర హీరోలు సైతం ఆసక్తి కనబరుస్తారని అనడం అతిశయోక్తి కాదు. ఇప్పుడు చిరంజీవి కూడా కృష్ణవంశీ దర్శకత్వంలో నటించబోతున్నారు. ఈ చిత్రం కోసం వంశీ అండర్ వాటర్ కెమెరాలను, వాటి వినియోగానికి సంబంధించిన విషయాలను తెలుసుకురావడం కోసం అమెరికా వెళ్ళనున్నారు. ఈ భారీ చిత్రానికి నిర్మాత ఎవరు? అనేది ప్రస్తుతం సస్పెన్స్ అయినా, వంశీ కూడా ఒక నిర్మాతగా వ్యవహరించనున్నట్లు తెలిసింది.

